సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం, 30, ఆగస్టు, 2025



చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.23
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.8°/21.3°
జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీశుడి భక్తుల గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతీని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని కుమ్మరవాండ్ల పల్లికి చెందిన పలువురు భక్తులు కదిరి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణతో పాపాలనుంచి ముక్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ ఏడాది మార్చిలో ప్రారంభమైన ఈ గిరి ప్రదక్షిణకు భక్తుల నుంచి స్పందన లభిస్తోంది. శుక్రవారం పలువురు భక్తులు గిరిప్రదక్షిణ చేయగా..ఆలయ అధికారులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే గ్రామ ప్రజలు భక్తులకు మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

25 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: వాతావరణ మార్పులతో జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ జిల్లాలోని 25 మండలాల పరిధిలో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా హిందూపురం మండలంలో 32.4 మి.మీ. అమడగూరు మండలంలో 30.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక రొళ్ల మండలంలో 29.4 మి.మీ, సోమందేపల్లి 24.2, పరిగి 19.6, చిలమత్తూరు 19.2, మడకశిర 19.0, అగళి 18.2, రొద్దం 14.8, గోరంట్ల 14.2, లేపాక్షి 14.2, తనకల్లు 10.8, పెనుకొండ 10.0, అమరాపురం 9.2, నల్లచెరువు 8.4, కొత్తచెరువు 6.6, గుడిబండ 6.4, బుక్కపట్నం 6.0, మిగతా మండలాల్లో 4 – 1.4 మి.మీ మధ్య వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

వైద్యురాలిపై దాడి హేయం

- కదిరి ఆస్పత్రిలో దుండగుల అరాచకాన్ని ఖండించిన ఐఎంఏ



విలేకరులతో మాట్లాడుతున్న వైద్యులు

కదిరి/కదిరి టౌన్: ప్రాణాలు పోసే వైద్యులపై దాడులు హేయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కదిరి శాఖ సభ్యులు అన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం పట్టణంలోని ఐఎంఏ హాలులో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీన కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి మద్యం మత్తులో వచ్చిన కొందరు దుండగులు విధుల్లో ఉన్న వైద్యురాలు రిషిత, నర్సు బాలముణెమ్మ, సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారని, సీసీ టీవీ ఫుటేజీ ద్వారా మిగతా వారినీ గుర్తించి అరెస్టు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే నిందితులపై వెంటనే కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేసినందున తమ ఉద్యమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో కదిరి ఐఎంఏ బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆజాద్, సెక్రటరీ డాక్టర్ భాస్కర్ నాయక్, ట్రెజరర్ డాక్టర్ విద్యాసాగర్, వైద్యులు సీవీ మధన్‌కుమార్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, హర్ష,సాయి, విజయ్ పాల్గొన్నారు.

తమ్ముళ్ల బరి తెగింపు



ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట హల్‌చల్

- అనంతలో రెండు వర్గాల నడుమ తరచూ ఘర్షణలు
- ఇటీవల పెనుకొండలో రెచ్చిపోయిన మంత్రి సవిత వర్గీయులు
- రెండు రోజుల క్రితం కదిరిలో వైద్య సిబ్బందిని చితకబాదిన 'తమ్ముళ్లు'
- తాజాగా శింగనమలలో ఎమ్మెల్యే, ఎంపీలకు వ్యతిరేకంగా ధర్నా
- నిస్సహాయంగా పోలీసులు.. భయకంపితులవుతున్న ప్రజలు



కదిరిలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వారితో కలిసి ధర్నా చేస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రోడ్డెక్కుతున్నారు.. నానా యాగీ చేస్తున్నారు.. అధికార మదంతో దాడులకూ దిగుతున్నారు.. కూటమి అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి 'తమ్ముళ్లు' రచ్చ చేస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అంతర్గత గొడవలు, వర్గపోరుతో టీడీపీ అట్టుడికిపోతోంది. స్వపక్షంలోనే విపక్షం అన్నట్టు పార్టీలోనే అసమ్మతులు రోజుకో నియోజకవర్గంలో భగ్గుమంటున్నాయి. తెలుగు తమ్ముళ్ల గొడవలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పోలీసులు నిశ్చేష్టుల్లా చూస్తూ ఉండిపోతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితి. కిందిస్థాయిలో చిన్న ఉద్యోగాలను సైతం ఎమ్మెల్యేలు అమ్ముకుంటుండటంతో పార్టీకి పనిచేసిన వారు రోడ్డెక్కుతున్నారు.

కియా వద్ద మంత్రి అనుచరుల హల్‌చల్..

రెండు వారాల క్రితం పెనుకొండలో కియా కార్ల ఉత్పత్తి పరిశ్రమ వద్ద మంత్రి సవిత వర్గీయులు చేసిన దౌర్జన్యం అంతా ఇంతా కాదు. కాంట్రాక్టులన్నీ తమకే కావాలని చేసిన రచ్చ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విడిభాగాల పరిశ్రమల నుంచి వచ్చే లారీలను బయటే ఆపేశారు. కియా పరిశ్రమ లోపలకు చొచ్చుకువెళ్లడానికి యత్నించారు. వందల మంది ఒక్కసారిగా రావడంతో పరిశ్రమ యాజమాన్యం ఆందోళన చెందింది. మళ్లీ నాలుగు రోజుల క్రితం టీడీపీ నాయకులు కొందరు గేటు బయట రచ్చ చేసినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

అర్బన్‌లో ఆధిపత్య పోరు..

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వర్గ పోరు పతాక స్థాయికి చేరింది. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య రోజుకో వివాదంతో గందరగోళం నెలకొంది. ఇద్దరి మధ్యా ఆధిపత్య పోరుతో ప్రశాంతంగా ఉండే అనంతపురం నగరంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మద్యం మత్తులో వైద్య సిబ్బందిపై దాడి

కదిరిలో రెండు రోజుల క్రితం మద్యం మత్తులో తెలుగు తమ్ముళ్లు హల్‌చల్ చేశారు. స్థానిక ఆస్పత్రిలో వైద్యురాలు రిషిత, నర్సు బాలమునెమ్మ, సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేశారు. బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇక.. ఉరవకొండ నియోజకవర్గం ఆమిద్యాల గ్రామంలో ఆధిపత్య పోరుతో టీడీపీకి చెందిన రెండు వర్గాలు తీవ్రంగా ఘర్షణ పడి ఒకరిని ఒకరు తన్నుకోవడం సంచలనం సృష్టించింది.

ఎమ్మెల్యే, ఎంపీపై తిరుగుబావుటా

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎంపీ అంబికా లక్ష్మినారాయణపై టీడీపీ కార్యకర్తలు తిరుగుబావుటా ఎగురవేయడం గమనార్హం. ఈ క్రమంలోనే శుక్రవారం పచ్చ పార్టీ నాయకులు బుక్కరాయ సముద్రం ఎంపీడీఓ ఆఫీసు వద్ద ధర్నా చేయడం చూసి జనం నవ్వుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఎమ్మెల్యే, ఎంపీ అమ్ముకుంటున్నారని, పార్టీ కోసం కష్టపడిన వారికి ఇవ్వడం లేదంటూ ఈ సందర్భంగా 'తమ్ముళ్లు' ఆరోపించడం చర్చనీయాంశమైంది. ఈ ఎమ్మెల్యే, ఎంపీ మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు తమ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలపై నిరసనలకు దిగడం జిల్లాలో సంచలనం సృష్టించింది. గతంలో ఎమ్మెల్యే శ్రావణిపై ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌కు రాతపూర్వకంగా కూడా ఫిర్యాదు చేయగం గమనార్హం. తాజా పరిణామాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాలన గాడి తప్పిన విషయాన్ని తేటతెల్లం చేస్తున్నారు. పోలీసులు నిస్సహాయులుగా మారి అన్నింటినీ చూస్తూ ఉండడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా సాగాలి

- అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు
- అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాం
- స్పష్టం చేసిన ఎస్పీ రత్న



పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా సాగాలని, ఎక్కడైనా ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే చాలా కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక నిమజ్జనానికి అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఊరేగింపు సమయంలో ఎవరూ మద్యం సేవించకుండా కమిటీ సభ్యులు చూసుకోవాలన్నారు. అలాగే రెచ్చగొట్టే విధంగా వ్యవహరించకూడదన్నారు. శోభాయాత్ర నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేయాల్సిన సమయం ఇప్పటికే కేటాయించి ఉంటారని, ఆ సమయంలోపు నిమజ్జనం పూర్తి చేసుకోవాలన్నారు. బందోబస్త్‌లో భాగంగా అత్యాధునిక సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఎక్కడైనా ఏదైనా ఘటన జరిగితే పోలీసులు వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నిమజ్జనం ప్రక్రియ ముగిసేంత వరకూ ఉత్సవ కమిటీల నిర్వాహకులు, పీస్ కమిటీల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అందరం కలిసి వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూద్దామన్నారు. నిమజ్జనం సమయంలో ఏదైనా సాయం అవసరమైతే డయల్ 100, 112 ఫోన్ చేయాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- వైద్యులకు కలెక్టర్ చేతన్ ఆదేశం
- ధర్మవరం ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఎన్టీఆర్ వైద్యసేవ సెంటర్ సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం అర్బన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. శుక్రవారం ఆయన ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని రికార్డుల నిర్వహణ, మందుల స్టాకు, శుభ్రత, సిబ్బంది హాజరు తదితర వివరాలను ఆరా తీశారు. వైద్య సేవల గురించి అక్కడున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ వైద్యసేవ సెంటర్‌ను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆస్పత్రి ఆవరణతో పాటు వార్డులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఓపీ విభాగం మరింత విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్ర నాయక్‌కు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

యూరియాను అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు

ప్రశాంతి నిలయం: యూరియాను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ అంశాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా రైతుల అవసరాల మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియాను అక్రమ నిల్వలు చేసే వారిపై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా అధిక ధరకు యూరియాను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకం కింద సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన భూమిని వెంటనే గుర్తించి సోమవారంలోపు నివేదికలను అందజేయాలని ఆర్డీఓలను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వ్యవసాయ శాఖ జేడీ సుబ్బారావు, తహసీల్దార్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పింఛన్లు

అర్హులైన వారందరికీ సెప్టెంబర్ 1న పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 36,793 పింఛన్లు ఉండగా, అందులో దివ్యాంగుల పింఛన్లు 35,078, హెల్త్ పింఛన్లు 1,715 ఉన్నాయన్నారు. వీటిలో 27,527 పింఛన్లు పునఃపరిశీలన పూర్తయ్యిందని, 7,163 మందికి వివిధ కారణాలతో పింఛన్‌కు అర్హత కోల్పోయినట్లు తేలిందన్నారు. అనర్హతకు గురైన వారందరూ మళ్లీ అప్పీల్ చేసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించిందన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్ల లాగిన్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఇలా అప్పీల్ చేసుకున్న వారందరికీ సెప్టెంబర్ 1న పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. త్వరలోనే వారంతా పునఃపరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.



కదిరిలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న భక్తులు

బైబై గణేశా

చవితి రోజున కొలువుదీరి మూడురోజులపాటు పూజలందుకున్న పార్వతీనందనుడిని భక్తితో సాగనంపారు. శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనం కోలాహలంగా సాగింది. శోభాయాత్రలో యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. వినాయకుడికి భక్తినీరాజనాలర్పించి గంగ ఒడికి చేర్చారు.

– సాక్షి బృందం



బత్తలపల్లిలో శోభాయాత్రలో గణనాథుడు



నిమజ్జనం సందర్భంగా తనకల్లులో యువత కోలాహలం

కడప జైలుకు నూర్ మహమ్మద్



నూర్ మహమ్మద్‌ను కడప జైలుకు తీసుకువెళ్తున్న పోలీసులు

ధర్మవరం: ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న నూర్ మహమ్మద్‌ను మూడు రోజుల పాటు విచారించిన పోలీసులు శుక్రవారం పుట్టపర్తి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు కడప జైలుకు తరలించారు. ఈనెల 27న కోర్టు అనుమతితో కడప జైలులో ఉన్న నూర్ మహమ్మద్‌ను కస్టడీలోకి తీసుకున్న ధర్మవరం పోలీసులు మూడురోజులపాటు విచారణ చేపట్టారు. అయితే విచారణలో నూర్ మహమ్మద్ సమాధానాలు దాటవేసే ధోరణి అవలంభించినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలతో వాట్సాప్ గ్రూపుల్లో చాటింగ్ చేసినట్లు మాత్రం తేలింది. వాట్సాప్ గ్రూపుల్లో ఇంకా ఎవరెవరు ఉన్నారు, ఎంత మందిని ఉగ్రవాదం వైపు మొగ్గు చూపేలా చేశావు అన్న కోణంలో పోలీసులు విచారణ చేసినా.. నూర్ మహమ్మద్ మౌనంగా ఉంటూ సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. మరోవైపు నూర్ మహమ్మద్ ప్రియురాలు పర్వీన్‌ను కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమెను కూడా వివిధ అంశాలపై విచారించారు. ఆతర్వాత ఆమెను కూడా పంపించినట్లు సమాచారం.

ఊరూరా 'ఎల్లో బెల్ట్'

కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో రెండు రోజుల క్రితం మద్యం బెల్ట్ షాప్ వద్ద టీడీపీ అల్లరి మూకలు పూటుగా మద్యం తాగి పరస్పర దాడులకు దిగాయి. ఈ దాడిలో గాయపడిన కొందరు కదిరి ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. మద్యం మత్తులో డ్యూటీలో ఉన్న వైద్యురాలు రిషితరెడ్డితో పాటు వైద్య సిబ్బంది, సెక్యూరిటీపై దాడులకు దిగారు. మద్యం మత్తులోనే దాడి జరిగిందని ఎస్పీ రత్న కూడా ధ్రువీకరించారు.

..ఇలా జిల్లాలో నిత్యం ఎక్కడోచోట మద్యం మత్తులో ఘర్షణలు జరుగుతున్నాయి. కూటమి సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి జిల్లాలో విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండగా..తప్పతాగుతున్న మందుబాబులు ఘర్షణలకు దిగి సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

- టీడీపీ నేతల కనుసన్నల్లో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులు
- ఫోన్ కొడితే ఏ సమయంలోనైనా ఇంటికే మద్యం సరఫరా
- బాటిల్‌పై రూ.20 నుంచి రూ.40 అదనం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు



మద్యం దుకాణాల సంఖ్య	87
ప్రస్తుతం ఉన్న బార్లు	12
బెల్ట్ దుకాణాల సంఖ్య	235

కదిరి: "బెల్ట్ షాప్‌లను సహించేది లేదు. ఎక్కడైనా బెల్ట్‌షాపు ఏర్పాటు చేస్తే రూ.5 లక్షలు జరిమానా విధిస్తాం. మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్ట్ షాప్ ఉంటే దుకాణం లైసెన్స్‌ను రద్దు చేస్తాం" అని సీఎం చంద్రబాబు చెప్పగా.. జిల్లాలో వాస్తవ పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామ గ్రామానా బెల్ట్ షాప్‌లు వెలిశాయి. మద్యం దుకాణాల నిర్వాహకులే వారి వ్యాపారం కోసం బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు. అందుకే జిల్లా వ్యాప్తంగా మద్యం ఏరులై పారుతోంది. వీటిని అరికట్టాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు.

సందు సందులో మందు

జిల్లా వ్యాప్తంగా 8 ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 87 మద్యం దుకాణాలున్నాయి. ఇవన్నీ దాదాపుగా అధికార టీడీపీ ప్రజా ప్రతినిధుల అనుచరులే నిర్వహిస్తున్నారు. వీటికి అనుబంధంగా మందు సేవించేందుకు ప్రతి మద్యం దుకాణం వద్ద ఒక సిట్టింగ్ రూమ్‌కు కూడా సర్కారు అనుమతి ఇచ్చింది. కదిరిలో మద్యం దుకాణాల్లో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 అదనంగా తీసుకుంటున్నారని మందుబాబులు చెబుతున్నారు. ఇవి కాకుండా జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ఒక బెల్ట్ షాప్ ఉంది. ఇవన్నీ అధికార టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. బెల్ట్‌షాప్‌లలో బాటిల్‌పై అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు తీసుకుంటున్నారు. బెల్ట్ షాప్‌లు రోజూ తెల్లవారుజామున 5 గంటలకే తెరిచి అర్ధరాత్రి 1 గంట వరకూ నిర్వహిస్తున్నారు. కదిరి, ధర్మవరం, హిందూపురం, మడకశిర పట్టణాల్లోని బెల్ట్ దుకాణాల్లో చాలా చోట్ల మద్యం సేవించేందుకు సిట్టింగ్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేశారు. ఇవన్నీ అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నందున ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు తొంగి చూసేందుకు కూడా భయపడుతున్నారు. ఇక తాజాగా జిల్లాలో మరో 12 బార్‌లకు కూటమి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో కదిరిలో 3, ధర్మవరంలో 3, హిందూపురంలో 4, మడకశిరలో 1, పెనుకొండలో 1 ఇలా మొత్తం 12 బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ బార్లు కూడా అందుబాటులోకి వస్తే పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం దొరకనుంది.

పేరుకే ఫ్యామిలీ ధాబాలు

జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఫ్యామిలీ ధాబాలు వెలిశాయి. కానీ అక్కడ ముందు చుక్క..తర్వాతే ముక్క ఆర్డర్ చేస్తున్నారు. ధాబాల నిర్వాహకులే కొన్ని చోట్ల మందు సరఫరా చేస్తుండగా... ఇంకొన్ని చోట్ల మద్యం ప్రియులు వెంట సరుకు తెచ్చుకుంటే తాగేందుకు అనుమతిస్తున్నారు. ఇలా తాగి ధాబాల వద్ద గొడవలు జరిగిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి.

కూటమి నేతలదే బెల్ట్ బాగోతం



జిల్లాలో ఎక్కడచూసినా మందు ఏరులై పారుతోంది. పల్లె పల్లెలో మద్యం దుకాణాలు కనబడుతున్నాయి. ఇవన్నీ కూటమి నేతల కనుసన్నల్లోనే నిర్వహిస్తున్నారు. కదిరిలో వైద్యులపై గొడవకు కూటమి నేతలే బాధ్యత వహించాలి. బెల్ట్ బాగోతమంతా కూటమి నేతలదే. తాగిన మైకంలో వైద్యులపై దాడి చేయడం చాలా దారుణం.

– ఉషశ్రీచరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ

'బెల్ట్' తీస్తాం



జిల్లాలో ఎక్కడైనా బెల్ట్ షాప్ కనబడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తాం. మద్యం దుకాణదారులే ఈ బెల్ట్ షాప్‌లను ప్రోత్సహిస్తున్నారని తెలిస్తే వారి దుకాణం లైసెన్స్ రద్దు చేస్తాం. బెల్ట్ షాప్‌లపై ప్రత్యేక నిఘా పెడతాం. మద్యాన్ని అధిక ధరలకు విక్రయించినా చర్యలు ఉంటాయి.

–గోవిందు నాయక్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

ఈవీఎంల భద్రతపై ప్రత్యేక నిఘా తప్పనిసరి


రికార్డులో సంతకం చేస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం అర్బన్: ఈవీఎంల భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం ధర్మవరంలోని మార్కెట్‌యార్డు గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, ఫైర్ సేఫ్టీ, 24గంటల భద్రతాపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న పీఈటీలు


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: మండలంలోని పులమతి జెడ్పీహెచ్‌ఎస్ వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్‌బాబుతో పాటు గతంలో పనిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు రామాంజనేయులు శుక్రవారం ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి అవార్డులను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అందజేశారు.

నూతన బార్లకు నేడు లాటరీ

పుట్టపర్తి టౌన్: జిల్లాలో నూతన బార్ల ఏర్పాటుకు శనివారం కలెక్టర్ టీఎస్ చేతన్ ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని సాయిఆరామంలో లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కదిరి, ధర్మవరం, హిందూపురం ప్రాంతాల్లో మూడు చొప్పున బార్లు, మడకశిరలో 1, పెనుకొండలో 1, కల్లు గీత కార్మికులకు 1 చొప్పున బార్లను కేటాయించినట్లు పేర్కొన్నారు.

ఇంగ్లిష్‌పై ప్రావీణ్యం కరువు..

చేజారిన కొలువు!

- మంచి ర్యాంకు సాధించినా పీజీటీ పోస్టు కోల్పోయిన అభ్యర్థి
- రెండోరోజూ ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన
- వివిధ కారణాలతో 9 మంది పెండింగ్


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీలో మంచి ర్యాంకు సాధించాడు. అయితే ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ(సామర్థ్యం) పరీక్ష పాస్ కాని కారణంగా ఓ అభ్యర్థి పీజీటీ పోస్టు కోల్పోయాడు. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజు శుక్రవారం కూడా ప్రశాంతంగా సాగింది. గురువారం హాజరుకాని అభ్యర్థులకూ అవకాశం కల్పించడంతో రెండు రోజులకు కలిపి మొత్తం 757 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు అందాయి. వీరిలో వివిధ కారణాలతో 9 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పెండింగ్ పెట్టారు. కొన్ని సర్టిఫికెట్లు లేని కారణంగా హాజరైన వారిలో ముగ్గురివి పెండింగ్ పడగా, ఒక అభ్యర్థి ఫోన్ పని చేయలేదు. మరొక అభ్యర్థి బెంగళూరులో స్థిరపడ్డానని, తనకు ఇష్టం లేదని స్పష్టత ఇచ్చాడు. కేజీబీవీలో సీఆర్టీగా పని చేస్తూ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ఎంపికైన అభ్యర్థినిపై ఫిర్యాదు రావడంతో పెండింగ్ పెట్టారు. ఆమె సర్వీస్‌లో ఉంటూ జీతం తీసుకుంటూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసినట్లు ఫిర్యాదు అందింది. ఈమె తొలిరోజు హాజరైనా ఫిర్యాదు కారణంగా సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోకుండానే వెనుదిరిగింది. ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ పరీక్ష పాస్ కాని కారణంగా మరో అభ్యర్థిని రిజెక్ట్ చేశారు. స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఓ టీచరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పోస్టుకు ఎంపికయ్యాడు. అయితే, ప్రిన్సిపాల్‌గా పని చేసిన అనుభవం లేకపోవడంతో ఆయన ఈ పోస్టుకు అనర్హుడయ్యాడు. మొత్తం మీద జిల్లాలో 807 పోస్టులకు నోటిఫికేషన్ జారీ కాగా.. రెండు రోజుల్లో 757 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు అందాయి. ఇంకా 50 పోస్టులకు స్పష్టత రావాల్సి ఉంది. దీనిపై రాష్ట్ర అధికారుల నుంచి సమాచారం అందాల్సి ఉందని జిల్లా అధికారులు చెబుతున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షించారు. పూర్తి పారదర్శకంగా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టామని వారు స్పష్టం చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఫిర్యాదు స్వీకరించకుండా వెనక్కు పంపిన పోలీసులు


చెల్లాచెదురుగా పడేసిన బీరువాలోని సామగ్రి

ఎన్‌పీకుంట: తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి విలువైన బంగారు, నగదు, ఇతర సామగ్రిని అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... అనారోగ్యంతో బాధపడుతున్న ఎన్‌పీకుంట మండలం ఎస్.రెడ్డివారిపల్లికి చెందిన కె.నారాయణమ్మ పది రోజుల క్రితం బెంగళూరులోని కుమారుడి వద్దకెళ్లి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని శుక్రవారం తిరిగి వచ్చింది. ఇంటి తలుపులు తీసి లోపలకు ప్రవేశించిన ఆమె వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించి ఆందోళనకు గురై పరిశీలించింది. ఇంటి వెనుక ఉన్న తలుపులు బద్ధలు గొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన పొలానికి సంబంధించిన దస్తావేజులు, ఇంటి పత్రాలు, డిపాజిట్ బాండ్లు, ఎల్‌ఐసీ బాండ్లతో పాటు రెండు జతల బంగారు కమ్మలు, రూ.4వేల నగదు, విలువైన పట్టుచీరలు, 50 కిలోల బియ్యం బస్తా అపహరించుకెళ్లినట్లు గుర్తించి ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అయితే వినాయక నిమజ్జనం తర్వాత వచ్చి పరిశీలించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపి వెనక్కు పంపేశారు.

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం : డీఆర్‌ఎం

గుంతకల్లు: నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులకు క్రీడల ద్వారా మానసిక ప్రశాంత లభిస్తుందని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక రైల్వే గ్రౌండ్‌లో రైల్వే ఉద్యోగులకు నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రైల్వే ఉద్యోగులు ఆరోగ్యకరమైన జీవనం గడపడానికి అనేక క్రీడా సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. అందులో భాగంగా రైల్వే గ్రౌండ్‌ను ఆధునీకరించడంతోపాటు జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- లోతు పరిశీలించే క్రమంలో నీట మునిగి యువకుడి మృతి

బత్తలపల్లి: వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుని ఓ యువకుడు మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని మాధవ నగర్‌కు చెందిన బత్తుల శ్రీనివాసులు పెద్ద కుమారుడు హేమంత్‌కుమార్ (21)తన స్నేహితులతో కలసి తమ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను నిమజ్జనం చేసేందుకు శుక్రవారం బత్తలపల్లి మండలం సంగమేశ్వర క్షేత్రం సమీపంలోని చిత్రావతి నదికి చేరుకున్నాడు. నీటి లోతు చూసే క్రమంలో నదిలోకి దూకిన హేమంత్‌కుమార్... వెనక్కు వచ్చే క్రమంలో ఈత కొట్టలేక నీట మునిగి మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడి

నల్లచెరువు: వినాయక నిమజ్జనం సందర్భంగా విగ్రహం మీదపడడంతో చెరువు నీటిలో మునిగి ఓ యువకుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు... నల్లచెరువులో శ్రీ కన్యకా పరమేశ్వరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమను శుక్రవారం నిమజ్జనం కోసం ఓరువాయి పంచాయతీలోని చెరువువాండ్లపల్లి సమీపంలోని చెరువుకు తరలించారు. విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు పడుచూరి రోహిత్ అనే యువకుడిపై పడింది. దీంతో విగ్రహంతో పాటు యువకుడు నీటిలో మునిగాడు. గమనించిన స్థానికులు వెంటనే రోహిత్‌ను వెలికి తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోడంతో తొలుత స్థానిక పీహెచ్‌సీకి అనంతరం కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు.

నిమజ్జనం వేళ అప్రమత్తత అవసరం

- జిల్లాలో నేటి నుంచి వినాయక నిమజ్జనాలు ప్రారంభం
- మూడు వేలకు పైగా కొలువుదీరిన ప్రతిమలు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు చివరి దశకు చేరుకున్నాయి. శనివారం నుంచి నిమజ్జనాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో వినాయకుడి నిమజ్జనం వేళ అప్రమత్తత అవసరమని అధికారులు అంటున్నారు.

సాధారణం నుంచి భారీ పరిమాణం వరకు..

జిల్లాలో మూడు వేలకు పైగా మంటపాల్లో గణనాథులను కొలువుదీర్చారు. అత్యధికంగా హిందూపురం, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. చిన్న పరిమాణం నుంచి భారీ సైజ్ వరకూ ఉన్న ప్రతిమలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఇళ్లల్లో ఏర్పాటు చేసిన గణపయ్యలను మూడో రోజు కదిలించి శనివారం నిమజ్జనం చేయనున్నారు. ధర్మవరం ,పుట్టపర్తి, మడకశిర, హిందూపురం రూరల్ ప్రాంతాల్లో శనివారం, కదిరి పట్టణంలో మంగళవారం, హిందూపురం పట్టణంలో గురువారం నిమజ్జనం చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

జాగ్రతలు పాటించాలి

వినాయక నిమజ్జనంలో ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంటపాల్లో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్తలు పాటించాలంటున్నారు. ఎత్తైన విగ్రహాలను నిమజ్జనాలకు తరలించే సమయంలో డీజే వాహనాలు ఎక్కి కూర్చోవడం ప్రాణాపాయానికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. రహదారుల్లో వ్యతిరేక మార్గంలో విగ్రహాలను ఊరేగించడం, రోడ్డు మధ్యలో నడవడం లాంటివి చేయరాదంటున్నారు. మద్యం మత్తులో వేడుకల్లో పాల్గొనరాదని, నిమజ్జన సమయంలో నీటిలో దిగి ప్రాణాల పైకి తెచ్చుకోవడం సరికాదని అంటున్నారు. ఉత్సవాలు ముగిసే వరకూ మద్యం జోలికి వెళ్లకుండా ఉండటమే ఉత్తమమని పేర్కొంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యాప్తంగా విడతల వారీగా వినాయక నిమజ్జనాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే శాంతి కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి చైతన్య పరిచాం.

– రత్న ఎస్పీ

'ఎంజీఎం'కు క్రీడా ప్రతిభా అవార్డు


జేసీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్ఎం, పీడీలు

హిందూపురం టౌన్: పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎంజీఎం)కు జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా పాఠశాల అవార్డు దక్కింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన జాతీయ క్రీడా దినోత్సవంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును పాఠశాల హెచ్‌ఎం పాండురంగనాయకులు, పీడీ లోక్‌నాథ్ అందుకున్నారు. కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సుదర్శన్‌రెడ్డి, పీడీలు విలియమ్స్, రాణి, ప్రవీణ పాల్గొన్నారు.

కియా ఉద్యోగి అదృశ్యం


గురుప్రసాద్

పెనుకొండ రూరల్: కియా అనుబంధ పరిశ్రమలో పని చేస్తున్న యువకుడు కనిపించకుండా పోయాడు. ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కియా ఎస్‌ఐ రాజేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు... అనంతపురం జిల్లా శెట్టూరుకు చెందిన మైలారప్పకుమారుడు గురుప్రసాద్ ఇటీవల కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా చేరాడు. గుట్టూరులో తనకు కేటాయించిన గదిలోనే సెల్‌ఫోన్, ఇతర సామగ్రిని వదిలేసి వెళ్లిపోయాడు. యాజమాన్యం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం కియా పీఎస్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మానసిక పరిస్థితి సరిగా లేదని ఫిర్యాదులో గురుప్రసాద్ తండ్రి మైలారప్ప పేర్కొన్నారు.

బాస్కెట్‌బాల్ బాలికల జట్టుకు జేసీ ప్రశంస


జ్ఞాపికను అందజేస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ధర్మవరం అర్బన్: క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల తిరుపతి వేదికగా జరిగిన జోనల్ స్థాయి అమరావతి చాంపియన్‌షిప్ బాస్కెట్‌బాల్ పోటీల్లో రన్నరప్‌ను సాధించిన జిల్లా బాలికల జట్టును జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అభినందించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర క్రీడా ప్రాధికారక సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్ భాస్కర్‌తో కలసి బాలికల జట్టును జేసీ అభినందిస్తూ ట్రోఫీని అందజేశారు. అలాగే జట్టు క్రీడాకారులను ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు.

ప్రేమ తిరస్కారం... యువకుడి బలవన్మరణం

కూడేరు: తన ప్రేమను యువతి నిరాకరించడంతో క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన నారాయణ కుమారుడు అనిల్‌కుమార్ (28) కొంత కాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె అంగీకరించకపోవడంతో క్షణికావేశానికి లోనైన అనిల్ కుమార్.. సెల్ఫీ వీడియో తీసి ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేసి శుక్రవారం కూడేరు మండలం గొటుకూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై సీఐ రాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

ప్రశాంతి నిలయం: జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించింది. సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు మేరకు పీఆర్వో వేణుగోపాల రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత గడువు ఈ నెల 30తో ముగియనుంది. సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30వ తేదీ వరకు, లేదా కొత్త కార్డులు జారీ చేయడంలో ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉంటుంది. సోమవారం నుంచి బస్సు పాసులు రెన్యూవల్ చేయించుకోవచ్చు.

'దుర్గం'లో దొంగ నోట్ల హల్‌చల్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో దొంగనోట్ల చెలామణి వెలుగు చూసింది. బ్రహ్మయ్య గుడి వద్ద ఉన్న ఓ టీ కేఫ్‌లో శుక్రవారం మధ్యాహ్నం కళ్లజోడు ధరించిన వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు నటిస్తూ రూ.200 నోటును నిర్వాహకురాలు యశోదమ్మ ఇచ్చాడు. రెండు సిగరెట్లు తీసుకొని చిల్లర రూ.160 తీసుకుని వెళ్లిపోయాడు. అయితే అది దొంగ నోటుగా ఆలస్యంగా గుర్తించిన నిర్వాహకురాలి సమాచారంతో విషయాన్ని కొందరు యువకులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటి తరం క్రీడాకారులకు మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్


మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ప్రశాంతి నిలయం: మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని నేటి తరం క్రీడాకారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పిలుపునిచ్చారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. హాకీ ఆటకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ధ్యాన్‌చంద్ క్రీడానైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా జరిగిన స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఉదయ భాస్కర్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ మొరార్జీయాదవ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

కొండలపై రేసింగ్


ఎల్లుట్ల వద్ద ప్రమాదానికి గురైన స్పోర్ట్స్ బైక్

పుట్లూరు/శింగనమల: వ్యవసాయం మినహా ఏమీ ఎరుగని గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం స్పోర్ట్స్ బైక్‌ల మోత మోగింది. పుట్లూరు మండలం మడుగుపల్లి, ఎల్లుట్ల సమీపంలోని కొండలపై గాలిమరల వద్ద కారు, బైక్ రేసింగ్ టెస్ట్ డ్రైవ్ నిర్వహించారు. అయితే ఓ స్పోర్ట్స్ బైక్ రైడర్ నియంత్రణ కోల్పోయి ఎల్లుట్ల నుంచి నార్పలకు వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు బాలాజీని ఢీకొన్నాడు. ఘటనలో బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. కాగా, బెంగళూరుకు చెందిన మోటార్ స్పోర్ట్స్ నిర్వాహకులు శింగనమల, బుక్కరాయసముద్రం, పుట్లూరు ప్రాంతాల్లోని గాలిమరల రహదారులను రేసింగ్ కోసం శుక్రవారం పరిశీలించారు. దాదాపు 32 స్పోర్ట్స్ బైక్‌లు, 16 కారులతో టెస్ట్ రేసింగ్ నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ రేసింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ!

సాక్షి టాస్క్‌ఫోర్స్: తాడిపత్రి మండల తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మాన్యువల్‌గా జారీ చేసిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ శుక్రవారం కలకలం రేపింది. ఈ సంతకం కొంతకాలం క్రితం బదిలీపై వచ్చిన తహసీల్దార్‌ది కావడం గమనార్హం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. తాడిపత్రికి చెందిన ఓ యువతి గ్రూప్ –2 పరీక్షలకు సిద్ధమవుతూ అర్హత లేకున్నా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌తో లబ్ధి పొందేందుకు ప్రయత్నించింది. ఈ అంశంలో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మాన్యువల్‌గా సర్టిఫికెట్ జారీ చేశారు. వెరిఫికేషన్‌లో భాగంగా సర్టిఫికెట్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పంపింది. తన సంతకంతో కూడిన మాన్యువల్ సర్టిఫికెట్ చూడగానే తహసీల్దార్ సోమశేఖర్ నివ్వెరపోయారు. సంతకం చేసిన అధికారి గురించి ఆరా తీసి మందలించే ప్రయత్నం చేయడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తహసీల్దార్ తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశించినల్లు తెలిసింది. దీంతో డిఫెన్స్‌లో పడిన సదరు అధికారి అధికార పార్టీ నేతల వద్దకు చేరుకుని పైరవీలకు తెరలేపినట్లు సమాచారం.